శివం

వారణాసి రామలక్ష్మీనరసింహంగారు

౧

"శివా! మేడమీదికెళ్ళి పడుకో, ఇహ. తొమ్మిదైంది. ఇంకా మేలుకుంటే జబ్బుచేస్తుంది."

"పడుకుంటా, నాన్నా! కాస్సేపుండివెడతా."

"కాస్సేపూ లేదు గీస్సేపూ లేదు ఇప్పటికే ఆలస్యంఅయింది వెళ్ళు."

"పోనీ ఒక్కైదునిమిషాలు విని వెడతా, నాన్నా!"

"వెళ్ళమంటే ఏం వెడతావా-లేదా? పో ముందు పైకి" అని కసిరేడు నాన్న. ఈకసురుతో వుసూరుమంటూ మేడమీదికెళ్ళి పడుకున్నాడు శివుడు.

సదాశివుడి అక్కయ్యపెళ్ళి. క్రింద నగరాజారావుగారి వేణుగానం జరుగుతోంది. పాపం ఫ్లూటంటే అతనికి బహుయిష్టం. విందామంటే మేలుకోనివ్వరు. కారణం అతను కాస్త బలహీనంగావుంటాడని.

మేడమీదికెళ్ళి పడుకున్నాక కాస్సేపటికి నాన్నొచ్చిచూశాడు ఏంచేస్తున్నాడో అని. అది కనిపెట్టి శివుడు నిద్రవటించేడు. నాన్న మళ్ళీ కిందికెళ్ళేడు. వెంటనే దొంగలాగు మెల్లిగా మెట్లమీదికొచ్చి కటకటాలచాటున క్రీనీడలో కూచున్నాడు. తనకంతా కనిపిస్తోంది. కాని తన్నెవరూచూడరు. పాటలు చెవుల తనివితీరా విన్నాడు. 'పవమానసుతుడు' అన్న త్యాగయ్యగారి మంగళాన్ని వాయిస్తూన్నారు. ఇహఎవరో వకరు పైకొచ్చి తనదొంగతనాన్ని కనుక్కుంటారని లేచి క్రీనీడలోంచి మెల్లగా గదిలోకి వెళుతున్నాడు. వెనక మెట్లెక్కుతూన్న చప్పుడైంది—నాన్నేమో?—భయంతో వెనక్కి తిరిగిచూడకుండా చకచకానడిచేడు. తాను మంచాన్ని సమీపించేప్పటికే ఆవెనకాల మెట్లెక్కుతూవున్న ఆయన అతన్నికలుసుకున్నాడు. శివుడి భయం కొంచెంతగ్గింది. ఆయ నెవరోకాదు మేనమామే. విశాఖపట్నంనించొచ్చేడు పెళ్ళికి.

"ఇంకా మేలుకునేవున్నావుట్రా? శివా!"

"నాన్నతో చెప్పకు. కోప్పడతాడు. ఫ్లూటువిందామని అక్కడికొచ్చి కూచున్నా."

"ఐతే పాటకచ్చేరీకోసం అన్నమాట ఇంతదాక మేలుకున్నది? ఏం అంతయిది? పడుకోకపోయావుట్రా? మరెప్పుడన్నా వినొచ్చు. మేలుకుంటే జబ్బుచెయ్యదూ?"

"కాదు మామయ్యా! మరేం, ఫ్లూటంటే నాకుతగనియిష్టం. నేర్చుకోవాలనికూడావుంది. మామయ్యా! అమ్మ నేర్పిస్తానన్నది కాని నాన్నే ఒప్పుకోలా—డాక్టరుగారు నేను ఫ్లూటు నేర్చుకునేందుకు వీలయినంత బలంగా లేనన్నారుట, ఒద్దన్నాడు." "ఊహూ"

"పోనీ నేర్పించొద్దులే ఒకఫ్లూటన్నా కొనిపెట్టమంటేగూడా వల్లగాదన్నాడు. అమ్మనడిగితే వాయించటంరాందే ఫ్లూటెందుకు, ఒచ్చేరోజు కొనిపెడతాలే అంది. మామయ్యా! మరి, నువ్విచ్చింది, అమ్మిచ్చింది, అత్తయ్యిచ్చింది, పెద్దమ్మిచ్చింది దాచిపెట్టుకుని కొనుక్కోనా?"

"పోనీగానీ నేను కొనిపెట్టనా మంచిఫ్లూటుని?"

"ఆ, వూరికే నేఅంటావు. చివరికి చెప్పకుండానే వూరికెడతావు. నిజంగా చెప్పు, మామయ్యా! నిజంగా కొనిపెడతావా"?

"నిజంగానే. కాని, అదేమిట్రా శివా అమ్మ నువ్వు సరిగ్గా చదువుకోటం లేదంటోంది. చదువుకోకపోతే ఎట్లారా మరి?"

'హిస్టరీయే మామయ్యా! నాకురానిది. మిగతావాటిల్లో ఫస్టుమార్కు నాదే. ఐతే నువ్వీపరీక్షలో హిస్టరీలోగూడ సంపాయించాలన్నమాట ఫస్టుమార్కు. అట్లాయితే తప్పకుండా కొనిపెడతా మంచిఫ్లూటొకటి."

"బాగాచదువుతా మామయ్యా! నువ్వుమాత్రం తప్పకుండా కొనిపెట్టాలి, ఏం?"

"సరేనన్నానుగా. ఈపాటికో నిద్రపోవాల్సింది. నాన్నకి తెలిస్తే నిన్నూ నన్నూ కూడా కోప్పడతాడు."

మామయ్య కిందికెళ్ళేడు. శివుడు నిద్రపోయాడు.

౨

"శివన్నయ్యా! రావూ, దబ్బున. నాన్న బ్రహ్మన్నయ్య నుంచున్నారు వాయిట్లో నీకోసం."

"అబ్బ, ఏమిటే. నేనిప్పుడేరానని చెప్పు. ఆవాల్టికొచ్చి కలుసుకుంటాలే మిమ్మల్ని."

"ఎక్కడకలుసుకుంటావ్? బలే. కలుసుకుంటాట్ట. మేమెక్కడికెడుతున్నామో నాకే తెలీదు. చివరికి సినీమాకి తీసికెడతాట్ట."

"బజారులో కలుసుకుంటాలే పో."

"బజారులోనా? పాపం నీకోసంబజారులో కూచోమంటావేం మమ్మల్ని. రానన్నాడని చెప్పనా నాన్నతో."

"ఊఁ. సినీమాహాలుదగ్గిర నుంచుంటానన్నాడు మనకోసం అనిచెప్పు."

సుందరంవెళ్ళిపోయింది. సదాశివుడు ఐదున్నరఅరువేస్తేనేగాని బైటికిరాడు. అప్పటిదాకా చదువే. అంచేతనే సుందరంతో అప్పుడే రానన్నాడు. "రెండవ హెన్రీ 1154 నించి 1189 వరకు, ఒకటవరిచర్డు 1189 నించి 1199 వరకు"అంటూ చదవటంమొదలెట్టేడు. ఎంతసేపూ అదేపాఠం—ప్లాంటాజినెట్టులకథే చివరికి ఆరాజులంతాతనముందునాట్యంచేశారు.తలదిమ్మెక్కడంచేత కాస్తవిశ్రాంతికోసం కళ్ళుమూసుకున్నాడు. అట్టే వెళ్ళిపోయిందతనిమనస్సు ఫ్లూటుమీదికి. మళ్ళీ బాహ్యజ్ఞానం కలిగేటప్పటికి ఎనిమిదిగంటలైంది.

"పాఠం లింకాపూర్తికాలేదు. హాయిగా సినీమాకన్నా వెళ్ళేనుగాను, ఇట్లాపరాకుగాకూర్చోకుండా" అనుకుని అన్నానికెళ్ళేడు.అన్నంతింటం అంతాఅయేటప్పటికి తొమ్మిదైంది.ఇహ మేలుకోనివ్వరు. తెల్లారుగట్ట లేచి చదువుకుందామనుకున్నాడు. పాపం శివుడికి మెళుకువరాలే. తనచురుకుకాలతో సూర్యుడేలేపేడతన్ని.

"ఎండకూడాయెక్కింది. ఇంటికిచ్చిన లెక్కలన్నా చెయ్యలేదు. నిన్న సాయంకాలం అంతా హిస్టరీతో కూచున్నా"అనుకుని ఆదరాబాదరగా మొహంకడుక్కుని ఓవల్ టైన్ తాగి బడికెళ్ళేడు. పదింటికల్లా ఇంటికొచ్చేడు. మళ్ళీరెండుంబావుకిబడి. అన్నంతిని పదకొండున్నరయేప్పటికి కూచున్నాడు లెక్కలు చెయ్యటానికి. ఒంటిగంటన్నరదాకా తిప్పలుపడితే ఎనిమిదిలెక్కలు తేలేయి. అన్నంతిని రెండింటికల్లా బడికెళ్ళేడు. మొదటిపీరియడ్ హిస్టరీ. హిస్టరీకి లెక్కలకీ ఒక్కరేమాస్టరుగారు శివుడిక్లాసుకి. హిస్టరీలో మాస్టరుగారువేసిన ప్రశ్నలకు సరైనజవాబులేయిచ్చేడు. మాస్టరుగారు "ఇదేంవింత? శివుడుకూడా చదువుకొచ్చేడే" అన్నారు.

రెండోపీరియడ్ డ్రాయింగు. ఈగంటసేపట్లో చెయ్యవలసిన నాలుగులెక్కలలో కొన్ని కాకపోతే కొన్నైనా చేద్దామనుకున్నాడు. కాని డ్రాయింగుమాస్టరుగారు "లెక్కలు నాపీరియడ్ లో చెయ్యటానికొల్లగా"దన్నారు.

లెక్కలపీరియడ్ వచ్చింది. మాస్టరుగారందరిపుస్తకాలుచూశారు. శివుణ్ణి "అన్నీచెయ్యలేదేం" అని కోప్పడ్డారు. ఆగంటంతా శివుడునుంచునేవున్నాడు. పైగాపవెళ్ళేటప్పుడు తనను కలుసుకుని 995 న్నారు

మాష్టరుగారు. ఏమంటారో ఆ సేథయంతో గడిపేదు ఆపీరియడ్ అంతా. ఇంతలో గంటకొట్టేరు. పిల్లలు సంతోషంతో గంతులేస్తూ కలకలలాడుతూ వెళ్లిపోయారు.

శివుడు మాష్టరుగారినికలుసుకున్నాడు. మాష్టరుగారు బాగా కోప్పడ్డారు. శివుడికి గుడ్లనీళ్ళుతిరిగేయి. చివాట్లు పెట్టటంపూర్తిఅయాక "చెయ్యాల్సినలెక్కలన్నీ చేసి పుస్తకాన్ని నాడెస్కులో పెట్టివెళ్ళు. తాళం చెవ్విబంట్రోతుకివ్వు. నాకుపనుంది వెళ్ళుతున్నా. కలాయించేవా తన్నులే" అన్నారు మాష్టరుగారు.

లెక్కలుపూర్తయేటప్పటికి కారున్నరయింది. పుస్తకం డెస్కులో పెట్టటానికి, ఇదివరకేదాల్లో చాలా పుస్తకాలుండటంచేత పట్టలే. అందుచేత అవన్నీ సర్ది తనపుస్తకానికి చోటుచూపించేడు. ఈసర్దడంలో పుస్తకాల్లోనుంచి చాలాకాగితాలు కిందపడ్డాయి. మళ్ళీ ఆకాగితాలన్నీసరిగ్గాచూసి ఎందులోదందులో పెట్టి తాళంవేసి చెవ్వ బంట్రోతుకిచ్చి ఇంటికెళ్ళిపోయాడు.

3

ఎండాకాలం. రాత్రి. పరీక్షలైపోవటంచేత శివుడికి చదువుకోవలిసిందేమీ లేదు. అరు బయటపడుకో నియ్యకపోవటాన శివుడు మేడమీద గదిలో పడుకున్నాడు. కిటికీలోంచి తెలివెన్నెల లోపలికి పడుతోంది. శివుడు కిటికీవైపుకి వత్తిగిలిపడుకున్నాడు.

రాత్రిపదింటికైలుకొచ్చేడు శివుడి మామయ్య విశాఖపట్నంనుంచి. శివుడు ఫస్టుగానే ప్యాసయినాడని చెల్లెలువ్రాసిన జాబునుచూచి ఎండాకాలం శెలవలకి శివుణ్ణి విశాఖపట్నం తీసికెడదామనేపూహతో వచ్చేడు. వస్తూ తనముద్దుమేనల్లుడికొక ఫ్లూటు కొనుక్కొచ్చేడు. రాగానే శివుడు మెలుకువతో వున్నాడేమో ఫ్లూటు నిద్దామని మేడమీదికెళ్ళేడు. శివుడు నిద్రపోతున్నాడని ఫ్లూటుని అతనిపక్కన పెట్టి క్రిందికొచ్చేశాడు.

తెల్లారింది. శివుడికి మామూలుగా ఏడుగంటలకి ఓవల్ టైన్ తాగే అలవాటు. ఏడుగంటలుదాటినా కిందికిరాలేఅతను. "ఇంకా లేవలే,అవెధవ"అని లేపుకొద్దామని మేడమీదికెళ్ళింది శివుడితల్లి. శివుడు గదిలో కనపడలే. కిందికొచ్చి "శివుణ్ణెక్కడికన్నా పంపేరాయేమిటి? ఓవల్ టైనన్నా తాగలేవాడు" అని అవిడ అడిగింది తనభర్తని. "లేదే" అన్నాడాయన. ఎక్కడికివెళ్ళివుంటాడా అనేఆలోచనతో బంట్రోతు న్నడిగేరు. వాళ్ళు "మాకు తెలీదండీ"అన్నారు. ఎక్కడికెళ్ళుంటాడబ్బావాడు అని తల్లి, తండ్రి, మామయ్య పిల్లలుఅంతా మేడమీదికెళ్ళేరు. శివుడు గదిలో లేడు, అంతా దిగాలబడిచూస్తున్నారు. మామయ్య వూరికే మంచంవైపుచూస్తున్నాడు. తాను తెచ్చినఫ్లూటు పెట్టింది పెట్టినచోటేవుంది. దానికింద ఒకకాగితం కనిపించింది. దగ్గిరికెళ్ళి చూశాడు. దానిమీద 'మామయ్యకి'అనుంది. లోపల రాసివున్నదాన్ని చూశాడు. 'మీరంతా తొప్పడతారని తెలును. ఐనా వెళ్ళుతున్నా. మరిరాను. అందరికీనమస్కారాలు. చెల్లికీ,బ్రహ్మనికీముద్దులు— శివం'—అనుంది. ఏంబోధపడలే ఆయనకి.

౪

సాయంకాలం. అరున్నరైంది. పోలీసువాళ్ళదగ్గర్నించీరాలేదు, రైల్వేవాళ్ళదగ్గర్నించీరాలేదు శివుడి ఆచోకీ. శివుడిమామయ్యకి పిచ్చిపట్టినట్టుంది. ఏంచేస్తాడు? ఏంచెయ్యాలోతోచటంలే. ఇంట్లోంచి బయలు దేరి తనబావగారితో పులవైపు వెళ్ళుతున్నాడు. వెళ్ళుతూనే ఆలోచన నడిచివెళ్ళుంటాడా, రైలుమీద వెళ్ళుంటాడా, వెళ్ళితే ఎక్కడికివెళ్ళుంటాడు, అని ఇట్లా తర్కించుకుంటూవుండగా "మరిరాను" అన్నది జ్ఞాపకంవచ్చింది. మరిరాక ఎక్కడికిపోతాడు? ఎవరికికనపడ్డా మరి రావలిసిందే. ఐతే మరిరానంటే ఇహ యెవళ్ళకి కనబడడన్నమాట. చచ్చిపోతాడా శివుడు? అంటూ అప్రయత్నంగా కన్నీళ్లు వెల్లువలా కార్చే

996

లాయన. ఇట్లా పరాకుగా పోతూవుంటే ఎంతదూరం నడిచిందీ ఎంతకాలం అయిందీ తెలుస్తుందా మరి. బావగారితోటనుకున్నాడేగాని అదిదాటి మైలున్నరపైగావొచ్చేడు. ఇంతలో నక్కకూతలు వినిపించాయ్. ఎవరో పరుగెత్తినట్టు అలజడిఅయింది. ఈగోలతో తను తనలోకొచ్చేడు. ఏదో నీళ్ళలోపడ్డ శబ్దంఅయింది. శబ్దానుసరించివెళ్ళేడు. పదిగజాలునడిచేటప్పటికి ఒకదొరువు కనిపించింది. దొరువులో జానెడులోతుకన్నా మించిన నీళ్ళులేవు. అంతా బురదమయం. దొరువును సమీపించేడు. అందులో ఒకకుఱ్ఱాడు కనిపించేడు. తరుముకొచ్చినవక్కలు జ్వాలిగుండెలతో వూరికేనుంచున్నాయి. తనచేతికఱ్ఱతో వికటంగా కేకలేస్తూ వాటిని తరిమాడు. నక్కలు పారిపోయాయి. లోపలికుఱ్ఱాణ్ణి లేవనెత్తి "శివా!" అంటూ ఆవురుమన్నాడు. వెంటనే ఆబురదలో తెలివితప్పిపడివున్న శివుణ్ణి భుజానేసుకుని దడదడగుండెలతో వచ్చినదారినిపట్టేడు. తోటమాలిని లేపి శివుడిబురదగడిగి తన వుత్తరీయంలోచుట్టి ఒకమంచంమీద పడుకోబెట్టేడు. తోటమాలి డాక్టరుకోసం పరుగెత్తేడు. డాక్టరుగారు పావుగంటకల్లావచ్చేరు. ఉచితచికిత్స జరిగించేరు.

తెల్లవారింది. చుట్టూ అమ్మ, నాన్న, మామయ్యఅంతా నుంచున్నారు. వాళ్ళనిచూసి యేడవడం మొదలుపెట్టేడు వెఱ్ఱిగా. మామయ్య వాళ్ళందరినిపంపివేసి శివుణ్ణి బుజ్జగించి యేడవవద్దన్నాడు.

శివుడు ఏడుస్తూనే "కోప్పడకు. నన్ను క్షమించు"అన్నాడు. "ఏంచేశావనీనువ్వు. ఎందుకు కోప్పడ్డం? కాస్సేపుకళ్ళుమూసుకునిపడుకో." "అదిగాదు, మామయ్యా! నన్నుక్షమించు ముందు." "ఆ క్షమించా లే." "ఐతే కోపంలేదన్నమాట నామీద—నాకేం, అప్పాటొద్దు." "ఏం? ఎందుకనొద్దూ. చక్కగా నేర్పుతుం దువుగాని." "కాదు, మామయ్యా! ముందువిందూ, అంతా తెలుస్తుంది ఎందుకొద్దో." "తరవాత చెప్పుదువు గానిలే ముందుకాస్త ఓవల్ టైన్ తాగు. నిస్త్రాణకడుతుంది." "ముందు విను మామయ్యా! తరవాత తాగు తాను." "ఊఁ, చెప్పు." "మరేం, అఘన్నమార్కు నాకురావలసిందికాదు. మాస్టరుగారి డ్రాయరులో హిస్టరీపేపరు కనపడితేను చూశా. అంచేతే నాకన్నిమార్కులొచ్చేయి. లేకపోతే నారాయణంకిరావలి సింది. అతని కందులోనే నాకన్నా రెండుమార్కులు తక్కువొచ్చేయి." "ఈకాస్తకి ఎంతగోలచేశావు. ఆమాట చెప్పకపోయావు. నేను నారాయణానికే వేయించేవాణ్ణి ఆమార్కు." "మార్కులేకాదు,మామయ్యా! అతని స్కాలర్ షిప్పుకూడాపోయింది. ఫస్టుప్రైజుకూడా పోయింది. వెధవప్లాటుకోసం ఎంతపనిచేశాను అనిపించింది. నన్ను సిగ్గూ, దుఃఖం, భయం అన్నీఆవరించి పిచ్చెత్తినట్టయింది ఏంతోచక......" "స్కాలర్ షిప్పుమాత్రము యెందుకు పోతుందీ హెడ్మాస్టరుగారితో చెప్పితే." "నాకు భయంవేసింది." "ఎందుకూ భయం? ఆయ నింకా నిన్ను మంచివాడివని మెచ్చుకుంటారు." "పోనీ యిప్పుడు చెప్పితే?" "ఇప్పుడు చెప్పితేమట్టుకేం. ఇప్పుడైతే మరీమెచ్చుకుంటారు. నీవుపడ్డ ఆవేదననీ, పశ్చాత్తాపాన్నీచూసి." "ఐతే నువ్వువెళ్ళిచెప్పు, మామయ్యా! హెడ్మాస్టరుగారితో ఈసంగతంతా. ఆయన ఇందులో నేపడుతూన్న యాతన తెలుసుకుంటే బాగుంటుంది. లేక దీన్నిచులకనచేస్తే నాకు వెఱ్ఱో పిచ్చో యెత్తుతుంది." "మరేం భయంలే. ఆయన సంతోషిస్తారు. నువ్వు ఓవల్ టైన్ తాగు. తరవాత అమ్మా, వాళ్ళు ఇంటికి తీసికెడ తారు వెళ్ళు." "నాకు ఓవల్ టైనూఒద్దు, ఏమీఒద్దు. నువ్వొచ్చేదాకా నేనింటికెళ్ళను. ఎవరినీ లోపలికి రావద్దను."

స్కూలుపెట్టేక నారాయణానికి ఫస్టుప్రైజు, స్కాలర్ షిప్పు యిచ్చేరు. సదాశివుడికి 'మంచినడవడికి' అని ఒకమంచి బహుమతీయిచ్చేరు.